




# BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ అఫ్ న్యూ భారత్








సంపుటి - 01 సంచిక -71 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ 19-03-2026 గురువారం పేజీలు : 6







# దివ్యాంగుల జీవితాల్లో సరికొత్త వెలుగులు

## : ఏపీలో 'ఉచిత ఆర్టీసీ ప్రయాణం' ప్రారంభం!




అమరావతి, మార్చి 18 (బిఎన్ఎస్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో దివ్యాంగుల సంక్షేమం దిశగా కూటమి ప్రభుత్వం ఒక సువర్ణ అధ్యాయాన్ని లిఖించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది దివ్యాంగులకు ఏపీఎస్ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించే వినూత్న పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ వేదికగా అట్టహాసంగా ప్రారంభించారు. ఈ చారిత్రాత్మక ఘట్టంలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు పీఎన్ మాధవ్ మరియు రవాణా శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ, దివ్యాంగుల ఆర్థిక స్వావలంబనకు ఈ పథకం పెద్ద పీట వేస్తుందని ముఖ్యమంత్రి ప్రకటించారు.

దివ్యాంగులతో కలిసి బస్సు ప్రయాణం – ఆత్మీయ భోజనం:

పథకాన్ని ప్రారంభించిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్ మరియు పీఎన్ మాధవ్ స్వయంగా దివ్యాంగులతో కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ప్రయాణ సమయంలో దివ్యాంగుల పక్కన కూర్చుని, వారి దైనందిన జీవితంలో ఎదుర్కొంటున్న సవాళ్లు, పెన్షన్ల పంపిణీ, ఉపాధి అవకాశాలపై ఆత్మీయంగా చర్చించారు. అనంతరం విజయవాడలోని ఏ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక విందులో దివ్యాంగులతో కలిసి నేతలందరూ మధ్యాహ్నం భోజనం చేశారు. ముఖ్యమంత్రి స్వయంగా కొందరు దివ్యాంగులకు భోజనం వడ్డించి, వారిలో మనోధైర్యాన్ని నింపారు. "మీరు ఒంటరి వారు కాదు, ఈ ప్రభుత్వం మీ వెన్నంటే ఉంటుంది" అని పవన్ కళ్యాణ్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణం:

రాజధానిలో జరిగిన ప్రధాన కార్యక్రమంతో పాటు, రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లోనూ ఈ పథకం ప్రారంభోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా ప్రాంతాల్లోని మంత్రులు, ఎమ్మెల్యేలు మరియు జిల్లా కలెక్టర్లు దివ్యాంగులకు ఉచిత ప్రయాణ పాసులను పంపిణీ చేసి, బస్సు సర్వీసులను ప్రారంభించారు. పల్లె వెలుగు నుండి ఎక్స్‌ప్రెస్ సర్వీసుల వరకు (ఏసీ బస్సులు మినహా) దివ్యాంగులు తమ సదరం సర్టిఫికేట్ లేదా స్మార్ట్ కార్డును చూపించి ఉచితంగా ప్రయాణించవచ్చని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# బీజేపీ కార్యకర్తలపై కిరాతక దాడి

## : పరామర్శించిన ఎన్. రామచందర్ రావు




నల్గొండ, మార్చి 18 (బిఎన్ఎస్): నల్గొండ జిల్లాలో రాజకీయ సెగలు రాజుకున్నాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో బీజేపీ కార్యకర్తలపై జరిగిన వరుస దాడులు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. ఈ దాడుల్లో తీవ్రంగా గాయపడి స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు బుధవారం పరామర్శించారు.

# పోలవరం ముంపు గ్రామా నిర్వాసితులకు రూ.226 కోట్ల చెక్కును అందించిన సీఎం

## □ సమావేశానికి హాజరైన మంత్రి నిమ్మల రామానాయుడు, సీఎస్ సాయిప్రసాద్




పోలవరం ప్రాజెక్టు రాష్ట్రానికి జీవనాడి, నదులు అనుసంధానం జరిగితే రాష్ట్రవ్యాప్తంగా ప్రయోజనం కలుగుతుంది అని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అప్రాజెక్టు నిర్వాసితులు రాష్ట్ర ప్రయోజనాల కోసం తమ ఇళ్లను, భూములను, త్యాగం చేశారు,వచ్చే ఉగాది తర్వాత రెండు నెలల్లోనే పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామని సీఎం అన్నారు.నిపుణులతో అధ్యయనం చేయించి మళ్లీ కొత్త డయాఫ్రాం వాల్ నిర్మాణం చేపడుతున్నాం, ప్రాజెక్టులో ముమ్మరంగా పనులు జరుగుతున్నాయి అని,21 నెలల్లో 26,149 మంది నిర్వాసితులకు మొత్తం రూ.1943.53 కోట్లను చెల్లించాం అన్ని,ప్రాజెక్టు రెండు దశలుగా నిర్మితం అవుతోంది.

# పొత్తులపై విజయ్ కీలక వ్యాఖ్యలు..




తమిళనాడులో సినీ హీరో విజయ్ రాజకీయ పార్టీ ఏర్పాటు చేసినప్పుడి నుంచి.. పొత్తులపై రకరకాల ప్రచారాలు సాగుతూనే ఉన్నాయి.. ఇక, కేంద్ర ఎన్నికల సంఘం తమిళనాడు ఎన్నికల తేదీలను కూడా ప్రకటించడంతో.. పొత్తుల వ్యవహారం మరింత హాట్ టాపిక్‌గా మారిపోయింది..

# గల్ఫ్‌లో యుద్ధం సెగలు

## □ ఇరాన్ ఇంటెలిజెన్స్ చీఫ్ హతం.. □ భారత్ చేరిన చమురు ట్యాంకర్!




న్యూఢిల్లీ/టెహ్రాన్, మార్చి 18 (బిఎన్ఎస్): మధ్యప్రాచ్యంలో ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య యుద్ధం అత్యంత భయానక స్థాయికి చేరుకుంది. బుధవారం చోటుచేసుకున్న కీలక పరిణామాల్లో ఇరాన్ నిఘా విభాగం మంత్రి ఇస్మాయిల్ ఖతీబ్ ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో మరణించినట్లు ఇజ్రాయెల్ రక్షణ శాఖ ప్రకటించింది. అంతకుముందు రోజు జరిగిన దాడుల్లో ఇరాన్ భద్రతా మండలి కార్యదర్శి అలీ లారీజానీ, బాసిజ్ బలగాల అధిపతి సులేమానీలు మరణించగా, తాజాగా ఖతీబ్ హతం కావడం ఇరాన్ నాయకత్వానికి కోలుకోలేని దెబ్బగా మారింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో బుధవారం భారీ ఎత్తున అంత్యక్రియలు జరిగాయి. దీనికి ప్రతీకారంగా ఇరాన్ తన క్షిపణులతో ఇజ్రాయెల్‌పై విరుచుకుపడటంతో పాటు, హార్ముజ్ జలసంధిని తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ప్రకటించింది.

# అసెంబ్లీలో 'మూసీ' రణరంగం

## : అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం!




హైదరాబాద్, మార్చి 18 (బిఎన్ఎస్): తెలంగాణ శాసనసభ బుధవారం మూసీ నది ప్రక్షాళన మరియు పునరుజ్జీవన ప్రాజెక్టుపై జరిగిన వాడీవేడి చర్చతో దద్దరిల్లింది. అధికార కాంగ్రెస్ మరియు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మధ్య సాగిన ఈ వాగ్వాదం సభలో తీవ్ర ఉత్కంఠను రేకెత్తించింది. మూసీ ప్రక్షాళన పేరుతో వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని, పేదల ఇళ్లను కూల్చివేస్తున్నారని బీఆర్ఎస్ నేతలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తగా.. దశాబ్దాల కాలం మూసీని మురికికూపంగా మార్చిన పాపం గత ప్రభుత్వానిదేనని మంత్రులు గట్టిగా తిప్పికొట్టారు.

# ఏపీలో ఖాకీల అరాచకం..

## □ చట్టాన్ని చుట్టచుట్టేస్తున్నారు

## : మాజీ మంత్రి అంబటి రాంబాబు ధ్వజం




గుంటూరు, మార్చి 18 (బిఎన్ఎస్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పోలీసు యంత్రాంగం తీరుపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో పోలీసులు చట్టానికి అతీతంగా వ్యవహరిస్తున్నారని, రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాల్సిన వ్యవస్థలు నేడు అధికార పార్టీకి తొత్తులుగా మారాయని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం గుంటూరులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుండి రాష్ట్రంలో వైయస్సార్సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు, వేధింపులు మితిమీరిపోయాయని ఆరోపించారు.

# జమిలి ఎన్నికలు షురూ

## సీఎం రేవంత్ రెడ్డి జోస్యం





న్యూఢిల్లీ (బిఎన్ఎస్) : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో భాగంగా మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో దేశ రాజకీయాలపై అత్యంత కీలకమైన మరియు సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన 'జమిలి ఎన్నికల'పై ఆయన స్పందిస్తూ, 2029లో జమిలి ఎన్నికలు రావడం ఖాయమని, అందుకు సిద్ధంగా ఉండాలని వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం ఈ దిశగా వడివడిగా అడుగులు వేస్తోందని, ముందస్తు ఎన్నికల కంటే నేరుగా జమిలి ఎన్నికలకే వెళ్లే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు అటు రాష్ట్ర, ఇటు దేశ రాజకీయ వర్గాల్లో పెను దుమారం రేపుతున్నాయి.

జమిలి ఎన్నికలతో పాటు రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ నిధులు, విభజన హామీలపై కేంద్ర మంత్రులతో జరిపిన చర్చల వివరాలను ఆయన మీడియాకు వివరించారు.

# ముస్లిం సోదరులకు వైయస్ జగన్ ఇఫ్తార్ విందు

## : మత సామరస్యానికి ప్రతీకగా వేడుకలు!




తాడేపల్లి, మార్చి 18 (బిఎన్ఎస్ ): పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం తాడేపల్లిలో ఘనంగా ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ వేడుకకు పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముస్లిం మత పెద్దలు, మౌజంలతో కలిసి ఆయన ప్రార్థనల్లో పాల్గొన్నారు.

BNS BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్



# దివ్యాంగుల జీవితాల్లో సరికొత్త వెలుగులు

మొదటి పేజీ తరువాయి

గతంలో ఉన్న రాయితీని 100 శాతానికి పెంచుతూ తీసుకున్న ఈ నిర్ణయం వల్ల రాష్ట్ర ఖజానాపై అదనపు భారం పడినప్పటికీ, దివ్యాంగుల సంక్షేమమే పరమావధిగా ఈ అడుగు వేసినట్లు రవాణా శాఖ మంత్రి తెలిపారు.

సామాజిక విప్లవంగా అభివర్ణన:

ఈ పథకంపై దివ్యాంగుల సంఘాల నేతలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి ఆసుపత్రులకు, పాఠశాలలకు వెళ్లే దివ్యాంగులకు ఇది పెద్ద ఊరటనిస్తుందని వారు పేర్కొంటున్నారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు పీఎన్ మాధవ్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కూడా దివ్యాంగుల సాధికారతకు ప్రాధాన్యత ఇస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం దేశానికే ఆదర్శమని కొనియాడారు. కేవలం ప్రయాణ సౌకర్యం మాత్రమే కాకుండా, భవిష్యత్తులో దివ్యాంగులకు ప్రత్యేక బ్యాక్లాగ్ పోస్టుల భర్తీ మరియు స్వయం ఉపాధి పథకాలపై కూడా దృష్టి సారిస్తామని మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారు. ఈ పథకం అమలుతో ఆంధ్రప్రదేశ్ మరోసారి సంక్షేమ రంగంలో అగ్రగామిగా నిలిచింది.

# ఏపీలో ఖాకీల అరాచకం.. చట్టాన్ని చుట్టచుట్టేస్తున్నారు

మొదటి పేజీ తరువాయి

చట్టాన్ని రక్షించాల్సిన వారే భక్షకులుగా మారుతున్నారని ఆయన మండిపడ్డారు.

అధికార పార్టీ కనుసన్నల్లోనే అరెస్టులు:

రాష్ట్రవ్యాప్తంగా సాగుతున్న అరెస్టుల పర్వాన్ని ప్రస్తావిస్తూ.. ఎటువంటి నోటీసులు లేకుండా, అర్ధరాత్రి వేళల్లో నేతలను తీసుకెళ్లడం ఏ రకమైన ప్రజాస్వామ్యమని అంబటి ప్రశ్నించారు. "చట్టం తన పని తాను చేసుకుపోవాలి కానీ, ఏపీలో పోలీసులు మాత్రం పచ్చ చొక్కాలు వేసుకుని పనిచేస్తున్నట్లు కనిపిస్తోంది. సోషల్ మీడియా పోస్టుల సాకుతో సామాన్య కార్యకర్తలపై థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు" అని ఆయన వ్యాఖ్యానించారు. తప్పు చేసిన వారిని శిక్షించడంలో అభ్యంతరం లేదని, కానీ కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే విపక్షాలను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆయన ధ్వజమెత్తారు.

కోర్టుల ఆదేశాలను కూడా బేఖాతరు చేస్తున్నారు:

కొన్ని సందర్భాల్లో ఉన్నత న్యాయస్థానాలు ఇచ్చిన ఆదేశాలను కూడా పోలీసులు బేఖాతరు చేస్తున్నారని అంబటి రాంబాబు ఆరోపించారు. పోలీసు అధికారుల అతి ఉత్సాహం వల్ల భవిష్యత్తులో వారు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. "అధికారం ఎవరికీ శాశ్వతం కాదు, కానీ వ్యవస్థలు శాశ్వతం. చట్టాన్ని అతిక్రమించి వ్యవహరిస్తున్న ప్రతి అధికారి వివరాలను మేము సేకరిస్తున్నాం. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి అరాచకాలకు పాల్పడితే రేపు సమాధానం చెప్పుకోవాల్సి వస్తుంది" అని ఆయన ఘాటుగా హెచ్చరించారు. అక్రమంగా నిర్బంధించిన కార్యకర్తలకు పార్టీ తరపున న్యాయ సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాటం:

రాష్ట్రంలో నెలకొన్న ఈ ఆటవిక పాలనపై ప్రజల్లోకి వెళ్తామని, పోలీసుల వేధింపులపై జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని అంబటి వెల్లడించారు. ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ఇలాంటి అక్రమ అరెస్టులతో ప్రజలను భయపెట్టాలని చూస్తోందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేక, ప్రజల దృష్టిని మళ్లించేందుకు వైయస్సార్సీపీ నేతలపై దాడులను ప్రోత్సహిస్తోందని మండిపడ్డారు. ఈ సమావేశంలో పలువురు పార్టీ నేతలు పాల్గొని, పోలీసుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు.

# బీజేపీ కార్యకర్తలపై కిరాతక దాడి

మొదటి పేజీ తరువాయి

బాధితుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఆయన, వారికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని, అధికారం అండతో అరాచకాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు.

రాష్ట్రంలో ఆటవిక పాలన సాగుతోంది:

బాధితులను పరామర్శించిన అనంతరం రామచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, విపక్ష కార్యకర్తలపై దాడులు చేయడం ద్వారా భయానక వాతావరణాన్ని సృష్టించాలని చూస్తున్నారని మండిపడ్డారు. "నల్గొండ జిల్లాను హింసా రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చాలని కొందరు చూస్తున్నారు. బీజేపీ కార్యకర్తలు ధైర్యంగా పోరాడుతున్నందుకే వారిని లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారు. ఈ దాడుల వెనుక ఉన్న అసలు సూత్రధారులను కఠినంగా శిక్షించాలి" అని ఆయన డిమాండ్ చేశారు. పోలీసు యంత్రాంగం నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, లేనిపక్షంలో డీజీపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

బాధితులకు భరోసా.. శ్రేణులకు పిలుపు:

గాయపడిన కార్యకర్తలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి యాజమాన్యాన్ని ఆయన కోరారు. పార్టీ తరపున బాధితులకు ఆర్థిక సహాయం అందజేస్తామని ప్రకటించారు. కార్యకర్తలు ఎవరూ అధైర్యపడొద్దని, అక్రమ దాడులను ఎదుర్కొనే సత్తా బీజేపీకి ఉందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నల్గొండలో జరిగిన ఈ దాడికి నిరసనగా జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మరియు భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. బాధితులను పరామర్శించిన రామచందర్ రావు రాకతో జిల్లా బీజేపీ కేడర్‌లో కొత్త ఉత్సాహం నెలకొంది.

పోలీసుల నిఘా.. భారీ బందోబస్తు:

రామచందర్ రావు పర్యటన నేపథ్యంలో నల్గొండలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో గట్టి నిఘా ఉంచారు. దాడులకు సంబంధించి ఇప్పటికే కొందరిని అదుపులోకి తీసుకున్నామని, పూర్తి విచారణ జరుపుతున్నామని పోలీసులు వెల్లడించారు. అయితే, అధికార పార్టీ ఒత్తిడితోనే పోలీసులు మెతక వైఖరి అవలంబిస్తున్నారని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనతో నల్గొండ జిల్లా రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది.

# ముస్లిం సోదరులకు వైయస్ జగన్ ఇఫ్తార్ విందు

మొదటి పేజీ తరువాయి



అనంతరం ఇఫ్తార్ సమయంలో ముస్లిం సోదరులకు స్వయంగా పండ్లు, ఫలహారాలు వడ్డించి, వారితో కలిసి విందు ఆరగించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులందరికీ జగన్ రంజాన్ ముందస్తు శుభాకాంక్షలు తెలియజేశారు.

విందు అనంతరం జరిగిన సమావేశంలో వైయస్ జగన్ మాట్లాడుతూ.. రంజాన్ మాసం క్రమశిక్షణకు, దాతృత్వానికి మరియు భక్తికి నిదర్శనమని పేర్కొన్నారు. గత ఐదేళ్ల తమ పాలనలో ముస్లిం మైనారిటీల సంక్షేమం కోసం అనేక విప్లవాత్మక పథకాలను అమలు చేశామని గుర్తు చేశారు. విద్యా, ఆర్థిక రంగాల్లో ముస్లిం యువత ఎదిగేందుకు తమ ప్రభుత్వం కల్పించిన ఊతం ఎప్పటికీ నిలిచి ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అధికారం ఉన్నా లేకపోయినా, ప్రతి ముస్లిం కుటుంబానికి వైయస్సార్ కుటుంబం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారి హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు, వైయస్సార్సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మరియు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రముఖ ముస్లిం నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జగన్ మోహన్ రెడ్డి పట్ల ముస్లిం సమాజం చూపుతున్న ఆదరణ వెలకట్టలేనిదని, తమ హయాంలో ప్రవేశపెట్టిన ఇమామ్, మౌజంల గౌరవ వేతనం వంటి నిర్ణయాలు నేటికీ వారి గుండెల్లో నిలిచి ఉన్నాయని పార్టీ నేతలు పేర్కొన్నారు. మత సామరస్యాన్ని కాపాడటంలో జగన్ చూపే చొరవ అభినందనీయమని మత పెద్దలు కొనియాడారు. రంజాన్ పర్వదినం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలని వారు ఆకాంక్షించారు.

ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో, వైయస్ జగన్ నిర్వహించిన ఈ ఇఫ్తార్ విందు ప్రాధాన్యత సంతరించుకుంది. మైనారిటీ ఓటు బ్యాంకును పదిలపరుచుకోవడంతో పాటు, క్షేత్రస్థాయిలో పార్టీ కేడర్‌లో ఉత్సాహం నింపేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ముస్లిం మైనారిటీల పట్ల తమ పార్టీకి ఉన్న నిబద్ధతను చాటిచెప్పేలా ఈ వేడుకను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. వేడుక ముగిసే వరకు జగన్ అందరినీ పలకరిస్తూ, సెల్ఫీలు ఇస్తూ గడపడం కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

# అసెంబ్లీలో 'మూసీ' రణరంగం



మొదటి పేజీ తరువాయి

ఈ క్రమంలో ఇరుపక్షాల మధ్య సాగిన ఘాటైన వ్యాఖ్యలతో సభలో గందరగోళం నెలకొంది.

పేదల ఇళ్లపై బుల్డోజర్లా?: బీఆర్ఎస్ ప్రశ్నల వర్షం

బీఆర్ఎస్ పక్షాన మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు చర్చను ప్రారంభిస్తూ.. మూసీ ప్రక్షాళన ప్రాజెక్టు అంచనా వ్యయంపై ప్రభుత్వం పొంతనలేని సమాధానాలు చెబుతోందని ఆరోపించారు. లక్షన్నర కోట్ల రూపాయలతో చేపట్టే ఈ ప్రాజెక్టు కేవలం రియల్ ఎస్టేట్ ప్రయోజనాల కోసమేనని, హైడ్రా పేరుతో పేదల గూడు చెడగొడుతున్నారని విమర్శించారు. బాధితులకు సరైన పునరావాసం కల్పించకుండా ఇళ్లను మార్క్ చేయడం అమానుషమని, ఈ ప్రాజెక్టు వెనుక ఉన్న అసలు రహస్యం ఏంటో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. మూసీ సుందరీకరణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం 'కలెక్షన్ల'కు పాల్పడుతోందని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు సభలో దుమారం రేపాయి.

మురికికూపానికి కారణం మీరే: మంత్రుల ఎదురుదాడి

ప్రతిపక్షం విమర్శలను ముఖ్యమంత్రి తరపున మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి మరియు శ్రీధర్ బాబు గట్టిగా తిప్పికొట్టారు. పదేళ్ల పాలనలో మూసీని పట్టించుకోని బీఆర్ఎస్ నేతలకు ఇప్పుడు మాట్లాడే నైతిక హక్కు లేదని మండిపడ్డారు. గడిచిన పదేళ్లలో మూసీ పేరుతో ఎంత ఖర్చు చేశారో లెక్కలు చెప్పాలని సవాల్ విసిరారు. మూసీ పరీవాహక ప్రాంత ప్రజలను నరకం నుంచి విముక్తి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, ఎవరినీ రోడ్డున పడేయబోమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కేటాయిస్తామని స్పష్టం చేశారు. అభివృద్ధిని అడ్డుకోవడమే బీఆర్ఎస్ నైజమని మంత్రులు విమర్శించారు.

ప్రజా ప్రయోజనమే పరమావధి: ప్రభుత్వం స్పష్టత

మంత్రులు చర్చలో జోక్యం చేసుకుంటూ.. మూసీ ప్రక్షాళన అనేది కేవలం ఒక ప్రాజెక్టు మాత్రమే కాదని, అది హైదరాబాద్ భవిష్యత్తు మరియు ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని పేర్కొన్నారు. ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దే క్రమంలో మూసీని ప్రక్షాళన చేయడం చారిత్రక అవసరమని వివరించారు. రాజకీయ పంతాల కోసం అభివృద్ధిని అడ్డుకోవద్దని ప్రతిపక్షాలకు సూచించారు. సభలో చోటుచేసుకున్న ఈ ఘాటైన వాగ్వాదం కారణంగా స్పీకర్ పలుమార్లు సభను వాయిదా వేయాల్సి వచ్చింది. మొత్తానికి మూసీ సెగ అసెంబ్లీని కుదిపేయడంతో రాష్ట్ర రాజకీయాల్లో ఈ అంశం మరింత వేడెక్కింది.

# పోలవరం ముంపు గ్రామా నిర్వాసితులకు రూ.226 కోట్ల చెక్కును అందించిన సీఎం

మొదటి పేజీ తరువాయి

తొలిదశలో 38,068 మంది నిర్వాసితులు ఉన్నారు,75 నిర్వాసిత కాలనీల్లో ఇప్పటికే 26 పూర్తి అయ్యాయి. ఇంకా 49 కాలనీలు నిర్మాణంలో ఉన్నాయి,2026 డిసెంబరు నాటికి వీటి నిర్మాణం పూర్తి అవుతుంది. ఇంకా రూ.3,500 కోట్ల మేర ఖర్చు చేయాల్సి ఉంది,ప్రతీ నిర్వాసితుడికి రూ.3.5 లక్షల మేర ఇంటి నిర్మాణం కోసం ఇస్తున్నాం. ఇంటి జాగా కోసం రూ.2 లక్షలకు పెంచాం, ఖర్చులు పెరిగినప్పటికీ ,కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో నిబద్ధతో ఈ నిర్మాణాన్ని పూర్తి పూర్తి చేస్తున్నట్లు వివరించారు. పుష్కరాల నిర్వహణ కంటే ముందే పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి జాతికి అంకితం చ్ఛ?స్తాం అని సీఎం చంద్రబాబు అన్నారు.

# పోలవరం రెవెన్యూ టీం కి సీఎం, మంత్రి అభినందనలు



పోలవరం (బిఎన్ఎస్): పోలవరం ప్రాజెక్టు లో భాగంగా పనిచేస్తున్న రెవెన్యూ టీం ని ముఖ్యమంత్రి చంద్రబాబు మరియు నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అభినందించారు. అనేక గ్రామాలు తిరిగి దఫా దఫాలుగా సమావేశాలు నిర్వహించి పరిష్కారం తెచ్చినందుకు అభినందనలు తెలిపారు. ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ అభిషేక్ సారథ్యంలో,, స్పెషల్ గ్రేడ్ కలెక్టర్ సరళ ఆధ్వర్యంలోని రెవెన్యూ అధికారులు... పోలవరం పరిధిలోని వివిధ జిల్లాల యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లారు. న్యాయం చేకూర్చేందుకు నిర్వాసితులకు భరోసా కల్పిస్తూ ప్రభుత్వ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. గతంలో వెలుగోడు ప్రాజెక్టులో సుదీర్ఘ అనుభవం కలిగిన రెవెన్యూ అధికారి సరళ.. పోలవరం ప్రాజెక్టు విషయం లో పూర్తిస్థాయిలో పనిచేస్తున్నారు. దాదాపు ఐదారు రెవెన్యూ జిల్లాలలో విస్తరించిన ముంపు గ్రామాలలో విస్తారంగా పర్యటనలు చేసి, నిర్వాసితులు వివరాలు సేకరించి పటిష్టమైన ప్రణాళికను అమలు చేశారు. మారుమూల గ్రామాలలో కూడా పర్యటించి నిర్వాసితులకు న్యాయం చేయించారు. సరళ మరియు అధికారుల బృందం చూపిన చొరవతో.. నిర్వాసితులకు న్యాయం కలగడంతో పాటుగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి మార్గం సుగమం అయింది.

# జమిలి ఎన్నికలు షురూ సీఎం రేవంత్ రెడ్డి జోస్యం

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకరించాలని, రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర ప్రయోజనాల కోసం తాము పోరాడుతామని స్పష్టం చేశారు. మూసీ పునరుజ్జీవనం, మెట్రో రైలు రెండో దశ విస్తరణ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు కేంద్రం నుండి సానుకూల స్పందన వచ్చిందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు తాము చేస్తున్న ప్రయత్నాలను ఆయన ఈ సందర్భంగా ఏకరువు పెట్టారు.

రాష్ట్ర రాజకీయాలపై స్పందిస్తూ, ప్రతిపక్షాల విమర్శలను ఆయన కొట్టిపారేశారు. ప్రజాపాలనలో భాగంగా తాము అమలు చేస్తున్న గ్యారంటీలు దేశానికే ఆదర్శమని, ప్రభుత్వం కూలిపోతుందంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని తేల్చి చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్ల పాటు సుస్థిరంగా ఉంటుందని, ప్రజలు తమకు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ అభివృద్ధి పథంలో దూసుకుపోతామని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ ఫిరాయింపులు మరియు ఇతర రాజకీయ పరిణామాలపై అడిగిన ప్రశ్నలకు ఆయన తనదైన శైలిలో సమాధానమిచ్చారు.

జమిలి ఎన్నికల నేపథ్యంలో పార్టీ యంత్రాంగాన్ని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయాలని ఇప్పటికే సంకేతాలు ఇచ్చారు. 2029 లక్ష్యంగా పాలనలో వేగం పెంచడమే కాకుండా, ప్రజల్లోకి ప్రభుత్వ పథకాలను మరింత సమర్థవంతంగా తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నారు. ముఖ్యమంత్రి చేసిన ఈ సంచలన వ్యాఖ్యలు రాబోయే రోజుల్లో తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో ఎలాంటి మార్పులకు దారితీస్తాయో వేచి చూడాలి.

# గల్ఫ్‌లో యుద్ధం సెగలు: ఇరాన్ ఇంటెలిజెన్స్ చీఫ్ హతం..

మొదటి పేజీ తరువాయి

భారత్ ఇంధన భద్రతకు ఊరట – 'జగ్ లాడ్కీ' సురక్షితం:

మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు గరిష్ట స్థాయికి చేరినప్పటికీ, భారత్ తన వ్యూహాత్మక చతురతతో ఇంధన సరఫరాను కాపాడుకోగలిగింది. యూఏఈ నుంచి 80,000 మెట్రిక్ టన్నుల ముడి చమురుతో బయలుదేరిన భారతీయ ట్యాంకర్ 'జగ్ లాడ్కీ' బుధవారం గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు సురక్షితంగా చేరుకుంది. హార్ముజ్ జలసంధి వద్ద ఇరాన్ ఆంక్షలు విధిస్తున్నప్పటికీ, భారత రాయబార కార్యాలయాల దౌత్యం కారణంగా మన దేశానికి చెందిన నౌకలకు మార్గం సుగమమైంది. అంతకుముందు 'నందాదేవి', 'శివాలిక్' అనే గ్యాస్ ట్యాంకర్లు కూడా సురక్షితంగా భారత్ చేరుకోవడంతో దేశంలో ఎల్‌పీజీ కొరత తలెత్తకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోగలిగింది. అయితే, యుద్ధం కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు 100 డాలర్ల మార్కును దాటడం భారత్ వంటి దిగుమతి దేశాలపై పెను భారాన్ని మోపుతోంది.

భారతీయుల భద్రతపై కేంద్రం దేగకన్ను:

గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న సుమారు కోటి మంది భారతీయుల భద్రత ఇప్పుడు కేంద్ర ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యతగా మారింది. ముఖ్యంగా ఇరాన్ తన డ్రోన్ దాడులను సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్ వంటి దేశాలకు కూడా విస్తరించడంతో అక్కడ పనిచేస్తున్న ప్రవాస భారతీయుల్లో ఆందోళన మొదలైంది. భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఇప్పటికే ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల విదేశాంగ మంత్రులతో ఫోన్లో మాట్లాడి, హింసను వీడి చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని కోరారు. భారత నావికాదళం 'ఆపరేషన్ సంకల్ప్' ద్వారా పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో భారతీయ వాణిజ్య నౌకలకు నిరంతరం రక్షణ కల్పిస్తోంది. అత్యవసర పరిస్థితి ఎదురైతే భారతీయులను స్వదేశానికి తీసుకువచ్చేందుకు విమానాలను సిద్ధంగా ఉంచాలని పౌర విమానయాన శాఖకు ఆదేశాలు అందాయి.

అంతర్జాతీయ విమాన సర్వీసులపై యుద్ధ ప్రభావం:

యుద్ధం కారణంగా ఇరాన్, ఇజ్రాయెల్ గగనతలాన్ని మూసివేయడంతో భారత్ నుంచి యూరప్, అమెరికా వెళ్లే విమానాలు సుదీర్ఘ మార్గాల్లో ప్రయాణిస్తున్నాయి. దీనివల్ల ప్రయాణ సమయం పెరగడమే కాకుండా, ఇంధన ఖర్చులు అధికమై విమాన టికెట్ల ధరలు ఒక్కసారిగా ఆకాశాన్ని తాకాయి. ప్రపంచ దేశాలు రెండు వర్గాలుగా విడిపోయిన ఈ తరుణంలో, భారత్ మాత్రం 'శాంతి' మంత్రాన్ని జపిస్తూనే.. తన జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవడానికి దౌత్యపరమైన వ్యూహాలను అమలు చేస్తోంది. ప్రపంచ శాంతికి ముప్పుగా మారిన ఈ యుద్ధం త్వరగా ముగియాలని, లేనిపక్షంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# పొత్తులపై విజయ్ కీలక వ్యాఖ్యలు..



తమిళనాడులో సినీ హీరో విజయ్ రాజకీయ పార్టీ ఏర్పాటు చేసినప్పడి నుంచి.. పొత్తులపై రకరకాల ప్రచారాలు సాగుతూనే ఉన్నాయి.. ఇక, కేంద్ర ఎన్నికల సంఘం తమిళనాడు ఎన్నికల తేదీలను కూడా ప్రకటించడంతో.. పొత్తుల వ్యవహారం మరింత హాట్ టాపిక్‌గా మారిపోయింది.. విజయ్ పార్టీకి చెందిన కీలక నేతలు.. ఓ వైపు భారతీయ జనతా పార్టీ నేతలతో చర్చలు జరుపుతున్నారని.. ఇన్ని సీట్లు, డిప్యూటీ సీఎం పోస్ట్.. టీవీకేకు ఇచ్చేందుకు బీజేపీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందనే వార్తలు కూడా హల్ చల్ చేస్తున్నాయి.. మరోవైపు.. డీఎంకేతోనూ చర్చలు సాగుతున్నాయనే లీక్‌లు వస్తున్నాయి..

ఈ నేపథ్యంలో.. పొత్తులపై టీవీకే అధినేత విజయ్ కీలకమైన వ్యాఖ్యలు చేశారు. నేను ఎవరితోనూ పొత్తు పెట్టుకోను అని స్పష్టం చేశారు.. ముఖ్యంగా ఎన్డీఏ కూటమిలోకి వెళ్లే ప్రసక్తే లేదు" అని విజయ్ కుండబద్దలు కొట్టారు.. మరోవైపు.. నన్ను అణిచివేయాలని కుట్రలు చేస్తున్నారు అని కూడా విజయ్ ఆవేదన వ్యక్తం చేశారు.. ఇక, తమిళనాడులో టీవీకే ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు టీవీకే అధినేత విజయ్..

కాగా, టీవీకే-బీజేపీ పొత్తుల కోసం సినీ నటి త్రిష రంగంలోకి దిగిందని.. ఏకంగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాతోనూ చర్చలు జరిపినట్టు కూడా సోషల్ మీడియాలో కొంత ప్రచారం సాగుతోన్న విషయం విదితమే.. మరోవైపు.. విజయ్‌కు ఒక జాతీయ పార్టీ సీఎం పదవి ఆఫర్ చేసిందని టీవీకే నేత అధవ్ అర్జున సంచలన వ్యాఖ్యలు చేశారు.. అయితే, ఈ ఆఫర్‌ను విజయ్ తిరస్కరించినట్లు అర్జున తెలిపారు. తమిళ రాజకీయాల్లో విజయ్ ప్రభావం స్పష్టంగా ఉంటుందని.. అందుకే విజయ్‌ను తమ వైపు తిప్పుకొనేందుకు జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ ప్రయత్నిస్తున్నాయనే ప్రచారం కూడా సాగుతోంది.. అయితే, 234 అసెంబ్లీ సీట్లు ఉన్న తమిళనాట ఏప్రిల్ 23న పోలింగ్ జరగనుండగా.. మే 4న ఫలితాలు వెలువడనున్నాయి..

# కొల్లూరు భూముల వ్యవహారం

## – అసలైన యజమానుల ఐక్యత

### మెసారా ఇన్‌ఫ్రాతో కలిసి హక్కుల సాధనకు దృఢమైన అడుగులు

MESARA
Infra Developers Limited

కొల్లూరు భూముల వివాదం మరో కీలక మలుపు తిరుగుతోంది. ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ వ్యవహారంలో ఇప్పుడు ఒక స్పష్టత ఏర్పడుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా -- చట్టబద్ధంగా ప్లాట్లు కొనుగోలు చేసినవారే అసలైన యజమానులని నొక్కి చెబుతూ, కొత్త ప్లాట్ యజమానులు ఒకే వేదికపైకి రావడం ఈ పరిణామాల్లో ప్రధానాంశంగా మారింది.

ఇకపై తమ హక్కుల కోసం సమిష్టిగా పోరాడాలని నిర్ణయించిన ఈ యజమానులు, మెసారా ఇన్‌ఫ్రా గ్రూప్‌తో కలిసి ముందుకు సాగడం ద్వారా సమస్యకు శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని నమ్ముతున్నారు.

1984 ప్లాట్ల విభజన -- చట్టబద్ధ యాజమాన్యానికి బలమైన ఆధారం

కొల్లూరు భూముల మూలాలను పరిశీలిస్తే, 1984లో ఈ భూములు చట్టబద్ధంగా ప్లాట్లుగా విభజించబడ్డాయి. అప్పటి నిబంధనలకు అనుగుణంగా ప్లాట్లు రూపొందించి రిజిస్ట్రేషన్ ప్రక్రియల ద్వారా విక్రయాలు జరిగాయి.

ఈ ప్లాట్లను కొనుగోలు చేసినవారు సాధారణ మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారే. తమ జీవిత పొదుపులతో ఈ స్థలాలను కొనుగోలు చేసిన వారు, చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ చేసుకొని యాజమాన్య హక్కులను పొందారు.

కాలక్రమేణా ఈ ప్లాట్లు మరికొన్ని సార్లు చేతులు మారినా, ప్రతి లావాదేవీ కూడా చట్టపరమైన విధానాల ప్రకారమే జరిగిందని యజమానులు స్పష్టం చేస్తున్నారు. అందువల్ల ఈ ప్లాట్లపై ప్రస్తుతం ఉన్న కొత్త యజమానులకే పూర్తి చట్టబద్ధ హక్కులు ఉన్నాయని వారు ధృవీకరిస్తున్నారు.

2002 అవుటర్ రింగ్ రోడ్ ప్రభావం -- పరిస్థితుల్లో అనూహ్య మార్పులు

2002లో అవుటర్ రింగ్ రోడ్ ప్రతిపాదన వెలువడిన తరువాత కొల్లూరు ప్రాంతం రియల్ ఎస్టేట్ పరంగా అత్యంత ప్రాధాన్యం పొందింది. నగరాభివృద్ధిలో కీలక ప్రాంతంగా మారే అవకాశంతో ఈ భూముల విలువ ఒక్కసారిగా పెరిగింది.

ఈ పరిణామాల తరువాత కొంతమంది ప్రభావశీలులు రంగప్రవేశం చేసి పరిస్థితులను మార్చే ప్రయత్నాలు చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ప్లాట్లుగా విభజించి విక్రయించిన భూములను తిరిగి ఎకరాలుగా చూపిస్తూ కొత్త లావాదేవీలు జరిపినట్లు ప్లాట్ యజమానులు చెబుతున్నారు.

దీంతో అసలు ప్లాట్ యజమానుల హక్కులు సందేహాస్పదంగా మారాయి. చిన్న చిన్న ప్లాట్లుగా ఉన్న భూములను పెద్ద ఎత్తున భూభాగాలుగా చూపిస్తూ జరిగిన ఈ మార్పులు వివాదాలకు దారితీశాయి.

లోకాయుక్త పరిణామాలు -- ప్లాట్ యజమానుల హక్కులకు బలం

కొల్లూరు భూముల వ్యవహారం చివరకు లోకాయుక్త దృష్టికి చేరిన తరువాత కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. 1984లో జరిగిన ప్లాట్ల విభజన, అనంతరం జరిగిన రిజిస్ట్రేషన్ లావాదేవీల చట్టబద్ధతను గుర్తించే విధంగా అభిప్రాయాలు వెలువడినట్లు ప్లాట్ యజమానులు చెబుతున్నారు.

ఇది కొత్త ప్లాట్ యజమానులకు గట్టి న్యాయబద్ధ ఆధారంగా మారింది. తాము కొనుగోలు చేసిన ప్లాట్లు చట్టబద్ధమైనవేనని, అందువల్ల తామే అసలైన యజమానులమని వారు మరింత ధైర్యంగా ప్రకటిస్తున్నారు.

"అసలైన యజమానులం మేమే" -- కొత్త ప్లాట్ యజమానుల స్పష్టమైన సందేశం

ఇప్పటి వరకు విభజితంగా ఉన్న ప్లాట్ యజమానులు ఇప్పుడు ఒకే వేదికపైకి వచ్చి తమ వాదనను బలంగా వినిపిస్తున్నారు.

"1984లో చట్టబద్ధంగా ఏర్పడిన ప్లాట్లను కొనుగోలు చేసిన వారమే అసలైన యజమానులు. ఆ హక్కులు ప్రస్తుతం మా చేతుల్లోనే ఉన్నాయి" అని వారు స్పష్టం చేస్తున్నారు.

ఈ స్పష్టతతో ఇప్పుడు వారు ఒక ఐక్య వేదికగా మారి తమ హక్కుల సాధన కోసం ముందుకు సాగుతున్నారు.

మెసారా ఇన్‌ఫ్రాతో ఐక్యత -- ఉద్యమానికి దిశా నిర్దేశం

ఈ నేపథ్యంలో ప్లాట్ యజమానులు తీసుకున్న అత్యంత కీలక నిర్ణయం -- మెసారా ఇన్‌ఫ్రా గ్రూప్‌తో కలిసి నడవడం.

సమస్యను చట్టబద్ధంగా పరిష్కరించడానికి అనుభవం, వ్యూహం, నాయకత్వం అవసరమని భావించిన యజమానులు, మెసారా ఇన్‌ఫ్రాను తమ భాగస్వామిగా ఎంచుకున్నారు.

మెసారా ఇన్‌ఫ్రా గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ మారెళ్ల పెంచల సుబ్బారెడ్డి నాయకత్వంపై వారు గట్టి విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. న్యాయపరమైన మార్గాల్లో సమస్యకు పరిష్కారం చూపగల నాయకత్వం ఆయనదేనని వారు భావిస్తున్నారు.

నాయకత్వంపై నమ్మకం -- విజయపథం వైపు అడుగులు

ప్లాట్ యజమానుల అభిప్రాయం ప్రకారం, మారెళ్ల పెంచల సుబ్బారెడ్డి నాయకత్వం వారికి ఒక స్పష్టమైన దిశను చూపుతోంది. గతంలో విడివిడిగా ఉన్న పోరాటం ఇప్పుడు ఒక సమిష్టి ఉద్యమంగా మారింది.

మెసారా ఇన్‌ఫ్రా మద్దతుతో తమ పోరాటానికి శక్తి, వ్యూహం, న్యాయపరమైన బలం లభించిందని వారు చెబుతున్నారు.

ఇకపై ప్రభుత్వంతో, అధికారులతో సమన్వయం చేసుకుంటూ, చట్టపరమైన మార్గాల్లో ముందుకు సాగుతూ తమ హక్కులను సాధించుకుంటామని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

విజయానికి దారి చూపుతున్న ఐక్యత

కొల్లూరు భూముల అంశం ఇప్పుడు ఒక కీలక దశలో ఉంది.

అసలైన యజమానులుగా తమ స్థానాన్ని స్పష్టం చేసిన కొత్త ప్లాట్ యజమానులు

లోకాయుక్త స్థాయిలో వచ్చిన న్యాయబద్ధ బలం

మెసారా ఇన్‌ఫ్రా నాయకత్వం

ఈ మూడు అంశాలు కలసి సమస్య పరిష్కారానికి దారి చూపుతున్నాయి.

మొత్తం మీద, కొల్లూరు ప్లాట్ యజమానుల ఉద్యమం ఇప్పుడు ఒక స్పష్టమైన దిశలో సాగుతోంది. "మేమే అసలైన యజమానులు – – మెసారా ఇన్‌ఫ్రాతో కలిసి మా హక్కులను సాధించుకుంటాం" అనే నినాదంతో వారు విజయపథం వైపు ధైర్యంగా అడుగులు వేస్తున్నారు.

---

## సిద్ధవరం వాసికి కఠిన సేవ పథకం అవార్డు



నెల్లూరు జిల్లా రాపూరు(బిఎన్ఎస్):–నెల్లూరు జిల్లా రాపూరు మండలం సిద్ధవరం గ్రామానికి చెందిన సబ్ ఇన్స్పెక్టర్ పాలెపు రాజశేఖర్‌కు రాష్ట్ర ప్రభుత్వంనుంచి గౌరవప్రదమైన గుర్తింపు లభించింది. 2018 బ్యాచ్‌కు చెందిన ఆయన, తన ఎనిమిది సంవత్సరాల సేవలో మావోయిస్టులను ఎదుర్కొనే గ్రేహౌండ్స్ విభాగం, ఉగ్రవాద నిరోధక చర్యల్లో కీలకమైన ఆక్టోపస్ విభాగం వంటి పలు ముఖ్యమైన పోలీసు శాఖల్లో విధులు నిర్వహించారు. ప్రస్తుతం ఉగ్రవాద కార్యకలాపాలను సమర్థవంతంగా ఛేదిస్తూ, తన సేవా నైపుణ్యంతో అంచెలంచెలుగా ఎదుగుతూ పోలీసు శాఖలో సాహసోపేతంగా విధులు నిర్వహించిన సిబ్బందికి అందించే ప్రతిష్ఠాత్మక "కఠిన సేవా పథకం"కు ఎంపికయ్యారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ గౌరవాన్ని ఆయనకు ప్రదానం చేయనుంది.

---

## దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం అన్నివిధాలా చేయూతనందిస్తుంది..




కొత్తపేట (బిఎన్ఎస్) మార్చి 18: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దివ్యాంగుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు.కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. దివ్యాంగ శక్తి పేరుతో ప్రభుత్వం దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించే పథకాన్ని బండారు సత్యానందం,బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారి తో కలిసి ప్రారంభించారు. ముందుగా వారితో కలిసి బస్సులో ప్రయాణించారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్ప్రెస్, పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్ప్రెస్ బస్సుల్లో మహిళలకు స్త్రీశక్తి పథకం కింద ఉచిత ప్రయాణం కల్పిస్తుండగా, ఇప్పుడు దివ్యాంగులు ఉచిత ప్రయాణం చేయవచ్చన్నారు.40 శాతం, అంతకంటే ఎక్కువ శాతం వైకల్యం ఉన్న దివ్యాంగులకు ఉచిత ప్రయాణం వర్తిస్తుందన్నారు. గత ఏడాది డిసెంబరు 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు.. వారికి ఇంద్రధనస్సు పేరిట ఆరు పథకాలు ప్రకటించారన్నారు.అందులో ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కూడా ఒకటన్నారు. కేవలం రెండు నెలల్లోనే ఇచ్చిన హామీని అమలుల్లోకి తీసుకువచ్చిన ఘనత మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకి దక్కుతుందన్నారు. ఈ పథకంతో రాష్ట్రంలో 11 లక్షల మంది దివ్యాంగులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. దివ్యాంగులకు మొదటి నుంచి టీడీపీనే ప్రాధాన్యత ఇస్తుందనీ, దివ్యాంగుల సంక్షేమానికి, ఆత్మగౌరవానికి ప్రాధాన్యత ఇచ్చిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదన్నారు. టీడీపీ దివ్యాంగుల కోసం అమలుచేసిన ప్రత్యేక పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. టీడీపీ ప్రభుత్వం అన్ని వర్గాలకు అమలు చేసినట్లే దివ్యాంగులకూ ప్రత్యేక రాయితీ రుణాలు పథకం అమలు చేసిందన్నారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ ద్వారా టీడీపీ అమలు చేసిన రాయితీ రుణాలు మంజూరు ప్రక్రియను జగన్ రెడ్డి అధికారంలోకి రాగానే నిలిపివేశారనీ, ఈ నిర్ణయం దివ్యాంగుల్లో తీవ్ర అసంతృప్తిని నింపిందన్నారు.టీడీపీ ప్రభుత్వం 2014లో అధికారంలోకి రాగానే 40 శాతం నుంచి 79 శాతం వరకు వైకల్యం ఉన్న దివ్యాంగులకు అప్పటివరకు అందుతున్న రూ.500 పింఛన్ రూ. 1000కి పెంచిందనీ, 90 శాతం అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారికి రూ.1500 చేసిందనీ 2019లో 79 శాతం లోపు వైకల్యం ఉన్న వారికి రూ.2 వేలు, అంతకంటే ఎక్కువ ఉన్న వారికి రూ.3 వేలు చొప్పున అందించిందన్నారు.ఇలా ఐదేళ్ల వ్యవధిలో దివ్యాంగుల పింఛన్ మొత్తా రూ.500 నుంచి రూ. 2వేలు, రూ.3వేలకు పెంచడంతో కొందరికి 300 శాతం, మరికొందరికి 500 శాతం లబ్ధి చేకూరిందన్నారు.2019 జగన్ రెడ్డి అధికారంలోకి రాగానే వైకల్య శాతంతో పని లేకుండా పింఛన్ అందరికీ ఒకేలా చేసి దివ్యాంగుల సంక్షేమం గాలికి వదిలేసిందన్నారు. మరలా

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దివ్యాంగుల పింఛన్ ను రూ.3 వేల నుంచి రూ.6వేలకు పెంచిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి దక్కిందన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

---

## అక్కను చంపి.. ముక్కలు చేసి.. అబ్దుల్లాపూర్‌మెట్‌లో దారుణం



అబ్దుల్లాపూర్‌మెట్: రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారంలో దారుణం చోటుచేసుకుంది. అక్క ప్రవర్తన సరిగా లేదనే కోపంతో ఆమెను తమ్ముడు హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని ముక్కలు చేసి చెరువులో పడేశాడు.

కొన్నాళ్ల క్రితం భర్త చనిపోవడంతో ఆమె ఒంటరిగా ఉంటోంది. ఆ తర్వాత ఆమె ప్రవర్తనలో మార్పును తమ్ముడు పప్పు రామ్ గమనించాడు. తీరు మార్చుకోవాలని చెప్పినా.. వినిపించుకోకపోవడంతో ఆమెను హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని రెండు ముక్కలుగా చేసి మజీద్‌పుర్ చెరువులో పడేశాడు. గత నెల 28న ఆమె బాటసింగారంలోని కిరాణ దుకాణానికి వెళ్లి కనిపించకుండా పోయినట్లు పోలీస్ స్టేషన్‌లో తమ్ముడు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి తమదైన శైలిలో దర్యాప్తు చేపట్టడంతో హత్య వ్యవహారం బయటపడింది.


---

## తెలంగాణ సీఎస్ పదవీ కాలం మరోసారి పొడిగింపు



హైదరాబాద్: తెలంగాణ సీఎస్ కె.రామకృష్ణారావు పదవీ కాలాన్ని కేంద్రం మరోసారి పొడిగించింది. ఆయన పదవీ కాలం పొడిగించాలన్న రాష్ట్ర ప్రభుత్వ వినతికి కేంద్రం అంగీకారం తెలిపింది. మరో మూడు నెలలు పొడిగించింది. గతేడాది ఏప్రిల్ 30న సీఎస్‌గా రామకృష్ణారావు బాధ్యతలు చేపట్టారు. అదే ఏడాది ఆగస్టులోనే ఆయన పదవీ విరమణ చేయాల్సింది. అప్పుడు ఏడు నెలలు పొడిగించింది. ఇప్పుడు మరోసారి పొడిగింపుపై కేంద్రం నిర్ణయం తీసుకుంది.

# నవాబుపేటలో రైతన్న -మీ కోసం కార్యక్రమం



నెల్లూరు జిల్లా రాపూరు(బిఎన్ఎస్): నెల్లూరు జిల్లా రాపూరు మండలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతుల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "రైతన్న-మీకోసం"కార్యక్రమం వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆదేశాల మేరకు రాపూరు మండలంలోని రాపూరు మేజర్ పంచాయతీ పరిధిలోని నవాబుపేట గ్రామంలో రాపూరు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చెన్నూ అశోక్ రెడ్డి, ఆధ్వర్యంలో ఇంటింటికి రైతన్న-మీకోసం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో "అన్నదాత సుఖీభవ" గురించి మరియు రైతుల సమస్యల గురించి ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలీసుకొన్నారు. కార్యక్రమంలో రాపూరు మండలం తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు చెన్నూ అశోక్ రెడ్డి, పి.ఏ.సి.యస్. అధ్యక్షులు దందోలు వెంకటేశ్వర్లు రెడ్డి, తెదేపా నాయకులు పచ్చిగళ్ల రత్నయ్య, మాజీ యంపీపీ ఇసళ్ళ సూర్యప్రకాష్ యాదవ్, పఠాన్ ఛాన్ భాష, గొర్ల వెంకటేశ్వర్లు యాదవ్, పల్లమాల మల్లేశ్వర్ యాదవ్, సమయం రమణ ప్రసాద్, మందాటి చంద్రమోహన్, తూమయి సర్పంచ్ చంద్రమోహన్, మండల వ్యవసాయ శాఖ అధికారి సోముసుందర్, వ్యవసాయ శాఖ సిబ్బంది శ్రీకాంత్, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# రాజులు తాళ్ళవలస బంగారమ్మ అమ్మవారికి వెండి కిరీటం మంగళసూత్రాలు బహుకరణ



భీమునిపట్నం (బిఎన్ఎస్): విశాఖపట్నం జిల్లా భీముని ప్రాంతంలో కొలువైన తాళ్ళవలస బంగారమ్మ.అమ్మవారికి ఆర్.ఆర్ బిల్డర్స్ డెవలపర్. మాకా ల వెంకట అప్పారావు సూర్యకళ దంపతులు కిరీటం మంగళసూత్రాలు 1లక్షల విలువైనవి అలంకరించారు. ఈ సందర్భంగా మకాల వెంకట.అప్పారావుమాట్లాడుతూ ఎంతో మహిమగల అమ్మవారికి మొక్కుబడి గా వెండి కిరీటం మంగళసూత్రాలు అందించమని చెప్పారు. ఈ కార్యక్రమానికి పి.శేషగిరి రావు రమాదేవి దంపతులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం



అవనిగడ్డ బీఎన్ఎస్, మార్చి 18: దివ్యాంగుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయ తలపెట్టిన దివ్యాంగశక్తి పథకాన్ని అవనిగడ్డ బస్టాండులో ఎమ్మెల్యే ప్రారంభించారు.

ఈ సందర్భంగా అర్హత కలిగిన దివ్యాంగులకు ఉచిత బస్ పాసులు అందచేశారు. దివ్యాంగుల తొలి ఉచిత ప్రయాణ బస్సును పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నలభై శాతం అంగవెల్యం ఉన్న వాళ్ళు పాస్ పొంది ఈ పథకం వినియోగించుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో 6,862మంది దివ్యాంగ పింఛన్లు, 321మంది వైద్య సంబంధిత పింఛన్లు పొందుతున్నారని తెలిపారు. నలభై శాతం వైకల్యం కలిగిన ప్రతి ఒక్కరూ ఆర్టీసీ డిపోల్లో ఉచిత బస్ పాస్ తీసుకుని దివ్యాంగ శక్తి పథకం వినియోగించుకోవాలని కోరారు. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్-ప్రెస్, మెట్రో ఎక్స్-ప్రెస్ బస్సుల్లో ఈ పథకం అమలు అవుతుందని తెలిపారు. నూరు శాతం ఆంధత్వం, బుద్ధి మాంధ్యం ఉన్న వారికి తోడుగా ప్రయాణించే ఒకరికి యాభై శాతం రాయితీ లభిస్తుందన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు వేగంగా అమలులోకి తెచ్చారని తెలిపారు. అనంతరం అవనిగడ్డ నుంచి చల్లపల్లి వరకూ దివ్యాంగులతో కలిసి ప్రయాణం చేశారు.

కార్యక్రమంలో నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, జనసేన జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, డిపో మేనేజర్ కే.హనుమంతరావు, ఎంపీడీఓ చంద్రశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ సీహెచ్ శ్రీలక్ష్మి, కూటమి నాయకులు కొల్లూరు ఇమ్మానియేల్, గుంటూరు వినయ్, నాయకులు, ఆర్టీసీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి గంటా వివాహ వార్షికోత్సవం



భీమిలి,బిఎన్ఎస్: భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శారద 40వ పెళ్లిరోజు ఆనందోత్సవాల మధ్య భోగాపురం సన్ రే రిసార్ట్స్ లో అంగరంగ వైభవంగా జరిగింది తెలుగు రాష్ట్రాల నుంచి అనేకమంది ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరై నాలుగు దశాబ్దాల ప్రేమకు ప్రత్యేకగా వీరి 40 వ పెళ్లి రోజు ను కుమారుడు రవితేజ కోడలు శరణి కుమార్తె పూజిత అల్లుడు ప్రశాంత్ ఘనంగా నిర్వహించారు సాంప్రదాయ బద్ధంగా వివాహ కృతను దగ్గరుండి నడిపించారు 40 ఏళ్ల క్రితం ఇదే రోజున గంటా శ్రీనివాసరావు శారదల ప్రేమ వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే బంధువులు స్నేహితులు నడుమ ప్రముఖ సినీ గాయకుడు ధనుంజయ్ నేతృత్వంలో సంగీత్ మెహందీ జరిగింది . ఉదయం 11:11 గంటలకి ముహూర్తానికి తాళి కట్టిన అనంతరం దండలను మార్చుకున్నారు గంటా వియ్యంకులైన మున్సిపల్ మంత్రి పి నారాయణ.భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు తో పాటు డిప్యూటీ స్పీకర్ కె రఘురామకృష్ణం రాజు.ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు. సుజనా చౌదరి. పత్తిపాటి పుల్లారావు.కొండ్రి. మురళి మోహన్. విష్ణు కుమార్ రాజు మేయర్ పిలా.శ్రీనివాసరావు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పి వి మాధవ్. పాతూరి నాగభూషణం.ఎంపీ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్. హుడా మాజీ చైర్మన్ నాగా రెహమాన్ మాజీ ఎమ్మెల్యే లు గద్దె బాబురావు సినీ నటులు శ్రీకాంత్ అశోక్ కుమార్ పకృతి అధినేత అంజిబాబు తదితరులు పాల్గొన్నారు

# దుర్గమ్మ రథోత్సవం



విజయవాడ (బిఎన్ఎస్) : ఉగాది పండుగను పురస్కరించుకొని ఇంద్రకీలాద్రిపై వసంత నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం అవుతున్నాయి ఈ ఉత్సవాల సందర్భంగా ఇంద్రకీలాద్రిపై కలిసి ఉన్న దుర్గమ్మను వెండి రథంపై ఊరేగించడం ఆనవాయితీగా వస్తుంది. ఉగాది పండుగ మరియు వసంతోత్సవాల వేడుకల కోసం వెండి రథం సర్వాంగ సుందరంగా సిద్ధమవుతోంది. తెలుగు నూతన సంవత్సరం మార్చి 19, 2026 (గురువారం) నాడు ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణం నిర్వహించనున్నారు. ఉగాది పర్వదినాన అమ్మవారి ఉత్సవ మూర్తిని వెండి రథంపై అధిష్టింపజేసి ఇంద్రకీలాద్రి మాడ వీధుల్లో వైభవంగా ఊరేగిస్తారు. రథోత్సవం కోసం ఆలయ అధికారులు ఇప్పటికే రథాన్ని శుద్ధి చేసి, మెరుగులు దిద్దే పనులను పూర్తి చేస్తున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున దర్శనం కోసం ప్రత్యేక క్యూలైన్లు మరియు ఏర్పాట్లు చేస్తున్నారు.

# వెలుగుమట్లలో యథాతథ స్థితి కొనసాగించాలి : హైకోర్టు



హైదరాబాద్: ఖమ్మం జిల్లా వెలుగుమట్ల భూదాన్ భూములపై పట్టణానికి చెందిన 24 మంది హైకోర్టులో పిటిషన్లు వేశారు. భూదాన్ యజ్ఞ బోర్డు ఇచ్చిన పట్టాల్లో ఇళ్లు కట్టుకున్నామని పేర్కొన్నారు. నోటీసులు ఇవ్వకుండా అధికారులు ఇటీవల ఇళ్లు కూల్చివేశారని ఆరోపించారు. ఈ పిటిషన్లపై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. వెలుగుమట్లలో యథాతథ స్థితి కొనసాగించాలని ఆదేశించారు. తదుపరి విచారణను 24వ తేదీకి వాయిదా వేశారు.

# అంతర్జాతీయ వేదిక పై... ఆశ్రమ్ విద్యార్థిని గౌరి జష్వికా అద్భుత విజయాలు....

## గౌరి జష్వికా విజయం మా పాఠశాల గర్వకారణం...






మండపేట. (బిఎన్ఎస్) మార్చి 18..అక్షరాల విజ్ఞానంతో పాటు కళా నైపుణ్యాలను ప్రోత్సహించడమే లక్ష్యంగా సాగుతున్న ఆశ్రమ్ పాఠశాల కీర్తి కిరీటంలో మరో అరుదైన మైలురాయి చేరింది.ఆశ్రమ్ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న చిరు ప్రాయపు బాలిక ఇసుకపట్ల గౌరి జష్వికా తన అద్భుత చిత్రకళా ప్రతిభతో అంతర్జాతీయ స్థాయి వేదికలపై మన పాఠశాల పేరును మారుమోగించింది.అంతర్జాతీయ రికార్డుల విజేతగా ఆశ్రమ్ స్కూలు విద్యార్థి అతి పిన్న వయసులోనే జష్వికా సాధించిన విజయాలు అసాధారణమైనవి అని కొనియాడారు.పది అంతర్జాతీయ రికార్డులు కు ఆరు బంగారు పతకాలను ఆశ్రమం స్కూల్ విద్యార్థులు రికార్డు సృష్టించింది.ఢిల్లీకి చెందిన ఇచ్ఛమా పోటీల్లో కేవలం 45 నిమిషాల్లోనే 'శివతాండవం' చిత్రాన్ని గీసి ప్రపంచ రికార్డును నెలకొల్పింది.ముంబై రంగోత్సవ్ ఆర్ట్ కాంపిటీషన్‌లో 4 బంగారు పతకాలు, అలాగే 2025 అంతర్జాతీయ పోటీల్లో మరో 2 బంగారు పతకాలు సాధించి మన రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచింది.సామాజిక స్పృహ ప్రతిభకు నిదర్శనంచదువుతో పాటు సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండటం జష్వికా ప్రత్యేకత అని అభినందించారు.సైన్స్ అండ్ ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో తను గీసిన 'జీవవైవిధ్యం' (బయోదివర్సిటీ ) చిత్రం అందరి ప్రశంసలు అందుకుంది. ఈ అద్భుత ప్రతిభకు గుర్తింపుగా జష్వికను ప్రతిష్టాత్మక ఉగాది పురస్కార్ వరించింది.పాఠశాల యాజమాన్యం అభినందనలు.కుంచె పట్టిన ఈ చిట్టి చేతులు రేపటి అంతర్జాతీయ చిత్రకళా జగత్తును శాసిస్తాయనడంలో సందేహం లేదు అని ఆశ్రమ్ పాఠశాల నిర్వాహకులు శ్రీ భాస్కర్ పద్మావత అవినాష్ జష్వికను ప్రత్యేకంగా అభినందించారు. ఇంత చిన్న వయసులోనే అంతర్జాతీయ ఖ్యాతి గడించి, పాఠశాల ప్రతిష్టను పెంచిన గౌరి జష్వికా భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆశ్రమ్ పాఠశాల యాజమాన్యం గౌరి జష్వికా ను అభినందించారు....

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక



నల్గొండ (బీఎన్ఎస్): 99 రోజుల కార్యాచరణ లో భాగంగా వైద్య నిపుణలచే ప్రతి పి హెచ్ సి లో నిర్వహిస్తున్న మెడికల్ క్యాంప్ లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కోరారు.. జిల్లాలోని మేళ్ల చెర్వు, మట్టపల్లి పి హెచ్ సి లలో జరిగే మెడికల్ క్యాంప్ లను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.. ఈ సందర్భంగా రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, స్థానిక సమస్యల ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఈ మెడికల్ క్యాంప్ ల ద్వారా జనరల్ మెడిసిన్, పిడియాట్రిక్, గైనకాలజీ, ఆర్థోపెడిక్, ఆప్తమాలజీ, మహిళలకు గర్భశాయ ముఖ కాన్సర్ ను గుర్తించే టాప్ స్ప్రెయర్, కంటికి సంబందించి కాంట్రాక్ట్ లోపం,బి పి షుగర్, చిన్న పిల్లలో ఎత్తు, పోషకాహార లోపాలకు చెందిన వైద్య నిపుణులు రోజుకొక్క పి హెచ్ సి లకు వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను అందించటం తో పాటు ఆరోగ్యం మెరుగు పడేలా పలు సూచనలు ఇస్తారని, అవసరమైన వారికి శస్త్ర చికిత్స లు, ఇతర వైద్య చికిత్సలు కూడా ఉచితంగా అందిస్తారని అన్నారు.. ఈ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు..

# హిందూ సమాజ ఐక్యతే లక్ష్యం: ఆర్ఎస్ఎస్




హైదరాబాద్ (బిఎన్ఎస్) : రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాల వేళ హిందూ సమాజంలో మార్పు, ఐక్యతను తీసుకువచ్చేందుకు ఐదు ప్రధాన అంశాలపై (పంచ పరివర్తన్) ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత కార్యవాహ కాచం రమేష్ వెల్లడించారు. బుధవారం భాగ్యనగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇటీవల హర్యానాలోని పానిపట్ సమీపంలో జరిగిన అఖిల భారతీయ ప్రతినిధి సభ (ABPS) నిర్ణయాలను వివరించారు.

దేశవ్యాప్తంగా సంఘం విస్తరణ వేగంగా జరుగుతోందని, ప్రస్తుతం దేశంలో 73,000 పైగా శాఖలు నడుస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. కేవలం శాఖల సంఖ్యను పెంచడమే కాకుండా, సమాజంలోని ప్రతి వర్గాన్ని దేశాభివృద్ధిలో భాగస్వాములను చేయడమే సంఘం లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

సమాజంలో సామాజిక సమరసతను పెంపొందించడం ద్వారా కుల వివక్షను రూపుమాపాలన్నదే ఆర్ఎస్ఎస్ ప్రాధాన్యత అని కాచం రమేష్ తెలిపారు. కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయడం (కుటుంబ ప్రబోధన్), పర్యావరణ పరిరక్షణ, స్వదేశీ జీవన విధానాన్ని ప్రోత్సహించడం మరియు పౌర బాధ్యతలను గుర్తు చేయడం వంటి అంశాలపై రాబోయే రోజుల్లో విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ముఖ్యంగా యువతలో జాతీయవాదాన్ని పెంపొందించేందుకు సంఘం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసిందని ఆయన వివరించారు. తెలంగాణలో కూడా సంఘం కార్యకలాపాలు గణనీయంగా పెరిగాయని, అన్ని మండలాలు మరియు గ్రామాలకు సంఘ సందేశాన్ని తీసుకెళ్లేందుకు స్వయంసేవకులు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

భారతదేశం తన సంస్కృతిని, అస్తిత్వాన్ని కాపాడుకుంటూనే ప్రపంచ దేశాలకు మార్గదర్శకత్వం వహించే స్థాయికి చేరాలని సంఘం ఆకాంక్షిస్తోందని ఆయన అన్నారు. రాబోయే శతాబ్ది ఉత్సవాల సందర్భంగా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని వెళ్లేలా 'సేవా' కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. దేశ భద్రత, సామాజిక ఐక్యత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, హిందూ సమాజం సంఘటితంగా ఉన్నప్పుడే దేశం బలంగా ఉంటుందని ఆయన నొక్కి చెప్పారు. ఈ సమావేశంలో సంఘం యొక్క ఇతర ముఖ్య నేతలు కూడా పాల్గొని, సంస్థాగత బలోపేతం కోసం తీసుకుంటున్న చర్యలను వివరించారు.

# గవర్నర్ ప్రసంగం హామీల ఎగవేత డిక్లరేషన్‌గా ఉంది: ఏలేటి మహేశ్వర్ రెడ్డి



హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ ప్రసంగంలో అబద్ధాలు చెప్పించిందని భాజపా శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. గవర్నర్ ప్రసంగం హామీల ఎగవేత డిక్లరేషన్‌గా ఉందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం సొంత డబ్బా కొట్టుకుంది తప్పితే.. అభివృద్ధికి సంబంధించిన దిశా దశ లేదని ఎద్దేవా చేశారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడారు.

"అప్పుల కుప్పలా రాష్ట్రం ఉంటే మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారుతుందని భ్రమలు కల్పిస్తున్నారు. ఇది ఎట్లా సాధ్యమో చెప్పాలి. రాష్ట్రంలో జీఎస్టీ వసూళ్లు 5 శాతం పడిపోయాయి. ఆర్థిక క్రమశిక్షణ లేని.. అప్పుల జాతర రాష్ట్రంలో నడుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి పాలన రైతుల పట్ల యమపాశంగా మారింది. ఉత్తర తెలంగాణలో జరిగిన పంట నష్టానికి పరిహారం ఇంత వరకూ ఇవ్వలేదు. రైతు భరోసా కోసం రైతులు ఎదురు చూస్తున్నారు" అని అన్నారు.

# ఆర్జీయూకేటీలో ఆందోళన.. 11 గంటలపాటు విద్యార్థుల నిరసన



ముథోల్,బిఎన్ఎస్ :నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీలో విద్యార్థులు ఆందోళన బాట పట్టారు. ఇది మంగళవారం ప్రారంభమై బుధవారం మధ్యాహ్నం వరకు కొనసాగింది. పీయూసీ రెండో సంవత్సరం చదువుతున్న తేజస్విని అనారోగ్యంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. దీనిపై విద్యాలయంలో వైద్యసౌకర్యాలు సరిగాలేవని మంగళవారం తెలంగాణ స్టూడెంట్ అసోసియేషన్ ఫర్ సాలిడారిటీ (టీఎస్ఏఎస్) నాయకులు, విద్యార్థులు మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఆర్జీయూకేటీలోని పరిపాలన భవనం వద్దకు వచ్చి ఆందోళనకు దిగడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మంగళవారం రాత్రి జిల్లా ఎస్పీ జానకీ షర్మిల బలగాలతో అక్కడికి చేరుకుని అక్కడే ఉన్నారు. ఉపకులపతి వైఖరిని నిరసిస్తూ, తమ సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు ఆందోళన విరమించేది లేదని విద్యార్థులు భీష్మించారు. ఉపకులపతి అక్కడికి వచ్చి తాను పదవికి రాజీనామా చేస్తానంటూ తన నివాసానికి వెళ్లిపోయారు. విద్యార్థులు వీసీ ఇంటికి చేరుకున్నారు. రాత్రంతా ఆయన ఇంటి ముందే ఆరుబయట నిద్రించి నిరసన తెలిపారు. చివరికి ఎస్పీ చొరవతో వీసీ బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ఇంట్లో నుంచి బయటకు వచ్చి వారితో మాట్లాడి వినతి పత్రం స్వీకరించడంతో గొడవ సద్దుమణిగింది.



ఇదీ జరిగింది..

గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న తేజస్విని ఈ నెల 12న ఆర్జీయూకేటీలోని ఆసుపత్రికి వెళ్లింది. అక్కడి వైద్యులు తలనొప్పి, జ్వరం ఉందని మాత్రలు ఇచ్చి పంపించారని విద్యార్థులు ఆరోపించారు. 13న ఆమె ఆరోగ్యం క్షీణించడంతో తల్లిదండ్రులు ఆమెను హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 16న మృతి చెందింది. దీంతో విద్యార్థులు, నాయకులు ఆందోళనకు దిగారు.

ఆసుపత్రిలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

తొమ్మిది వేల మంది విద్యార్థులున్న ఆసుపత్రిలో సరైన మందులు, సౌకర్యాలు లేక మెరుగైన వైద్యం అందడం లేదని విద్యార్థులు ఆరోపించారు. సౌకర్యాలు ఉంటే తేజస్విని మృతి చెందేది కాదని పేర్కొన్నారు. ఆసుపత్రిలో ఆధునిక పరికరాలు లేవని, సిబ్బంది కొరత వేధిస్తోందని, మహిళా వైద్యులు లేకపోవడంతో విద్యార్థినులకు వైద్యం అందడం లేదన్నారు. ఇప్పటికైనా మెరుగైన వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి రూ.50లక్షల పరిహారం అందజేయాలని, ఆధునిక పరికరాలు ఏర్పాటు చేయాలని, ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేయాలనే డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని ఉపకులపతికి ఇస్తే ఎలాంటి హామీ ఇవ్వలేదని విద్యార్థులు మండిపడ్డారు.

# రాష్ట్రంలో ఈ నాలుగు రోజులు భారీ వర్షాలు.. ప్రజలకు కీలక హెచ్చరికలు!



తెలంగాణలో నిన్న రాత్రి వర్షం కుమ్మేసింది. హైదరాబాద్‌లో రోడ్లు నీట మునిగాయి. మండే ఎండలతో ఇబ్బంది పడిన జనాలకు కొంత ఊరట లభించింది. అయితే.. వాతావరణ శాఖ మరో చల్లటి కబురు చెప్పింది. కర్ణాటక, తమిళనాడు మీదుగా కొమరిన్ ప్రాంతం వరకు ద్రోణి ఏర్పడిందని దీంతో తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నట్లు తెలిపింది. రానున్న నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని స్పష్టం చేసింది. ఉమ్మడి మహబూబ్‌నగర్‌తో పాటు రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని, ఉరుములు, మెరుపుతో కూడిన వర్షం కురుస్తుందని వెల్లడించింది. మరోవైపు.. హైదరాబాద్‌లో బుధవారం నుంచే నల్లటి మబ్బులు కమ్ముకున్నాయి. కొన్ని ప్రాంతాల్లో అయితే ఎడతెరిపి లేకుండా రాత్రి నుంచి వర్షం పడుతూనే ఉంది. ఈ నేపథ్యంలో ఈ జాగ్రత్తలు తప్పక పాటించండి.. అత్యవసరమైతే తప్పా బయటకు వెళ్లకండి. నీటితో నిండిన రహదారులు, వంతెనలు దాటేందుకు ప్రయత్నించవద్దు. విద్యుత్ తీగలు, పోల్‌లు తాకరాదు, వాటికి దగ్గరగా కూడా వెళ్లవద్దు. ఇళ్ల చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజ్ సదుపాయాలను శుభ్రం చేసుకోండి. చిన్న పిల్లలు, వృద్ధులు బయటకు వెళ్లకుండా జాగ్రత్తపడండి. నదులు, వాగులు పొంగిపొర్లే అవకాశం ఉన్నందున తీర ప్రాంతాల వద్దకు వెళ్లకండి. వరద నీరు ఇళ్లలోకి చేరే అవకాశం ఉంటే, ముందుగానే సురక్షిత ప్రదేశాలకు తరలించండి. పశువులను ఎత్తైన ప్రదేశాలకు తరలించండి. పిడుగు సమయంలో చెట్ల కింద లేదా ఓపెన్ ప్రదేశాల్లో నిలబడి ఉండవద్దు. మొబైల్ ఫోన్, ల్యాప్‌టాప్, టీవీ వంటి ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగాన్ని ఆపండి. పిడుగు సమయంలో నీటిలో ఉండవద్దు చేపలు పట్టడం లేదా స్నానం చేయడం మానుకోండి.

# కాంగ్రెస్ '420' హామీలు వెంటనే అమలు చేయాలి: నవాబుపేటలో బీజేపీ నిరసన




బిఎన్ఎస్ ,నవాబుపేట: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారంటీలతో పాటు 420 హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు నవాబుపేట మండల కేంద్రంలోని తహసీల్దార్ (ఎమ్మార్వో) కార్యాలయం ముందు బీజేపీ నాయకులు ధర్నా నిర్వహించి, వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలవుతున్నా, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మోసపూరిత హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని, అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. స్థానిక నాయకులు ప్రజా సమస్యలను గాలికొదిలేసి విలాసవంతమైన రాజకీయ జీవితానికి అలవాటు పడ్డారని ఆయన విమర్శించారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారి ఎన్నో రోజులుగా అధ్వానంగా ఉన్నా, కేవలం కమిషన్ల కోసమే రోడ్డు పనులను ప్రారంభించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక హైడ్రా పేరుతో, మూసీ ప్రక్షాళన సాకుతో ప్రభుత్వం పేద ప్రజల ఇళ్లను కూల్చివేస్తూ వారిని రోడ్డున పడేస్తోందని ధ్వజమెత్తారు. బఫర్ జోన్‌లో ఉన్న ఒవైసీ కాలేజీని హైడ్రా ఎందుకు ముట్టుకోవడం లేదని ఆయన ఈ సందర్భంగా ప్రశ్నించారు. పేదలపై చూపే ప్రతాపం బడా నేతలపై ఎందుకు ఉండటం లేదని నిలదీశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు చంద్రకాంత్, ఉపాధ్యక్షులు మహేందర్ రెడ్డి, మాజీ జిల్లా కార్యదర్శి జగన్, సీనియర్ నాయకులు గోపాల్ రెడ్డి, రవి, లక్ష్మణ్, మణికంఠ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, నర్సింహులు, విజయ్, శివ, బూత్ అధ్యక్షులు మాణిక్యం, దుర్గయ్య, నర్సింహా చారి, శ్రీకాంత్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హామీలు అమలు చేయకుంటే భారీ ఉద్యమం: బీజేపీ హెచ్చరిక



బిఎన్ఎస్ :నవాబుపేట: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను, ఇతర హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నవాబుపేట మండల కేంద్రంలోని తహసీల్దార్ (ఎమ్మార్వో) కార్యాలయంలో బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రకాంత్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను మోసం చేస్తోందని మండిపడ్డారు. రైతులకు ఇస్తామన్న రూ. 15,000 రైతు భరోసా ఊసే లేదని, పాత రైతుబంధు నిధులను కూడా సక్రమంగా ఇవ్వడం లేదని విమర్శించారు. మహిళలకు మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ. 2,500 ఇస్తామని, కళ్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి మాట తప్పారని ధ్వజమెత్తారు. నిరుద్యోగ భృతి కింద విద్యార్థులకు ఇస్తామన్న రూ. 3,016 ఊసే లేదని ఆరోపించారు. రైతులకు ఎంతో మేలు చేసే కేంద్ర ప్రభుత్వ 'ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన' పథకాన్ని తెలంగాణలో వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ పథకం ద్వారా రైతులకు మేలు జరిగితే తమకు కమిషన్లు రావనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం దీనిని అడ్డుకుంటోందని విమర్శించారు. ఇదే క్రమంలో స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్యపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎమ్మెల్యే ఏ పార్టీలో ఉన్నారో ఆయనకే తెలియని పరిస్థితి నెలకొందని, సొంత మండలంలోని రోడ్ల దుస్థితిని కూడా ఆయన పట్టించుకోవడం లేదని ఎద్దేవా చేశారు. గత 12 ఏళ్లుగా రోడ్ల కోసం ధర్నాలు, వినతి పత్రాలు ఇస్తున్నా స్పందన లేదని, ఇప్పటికైనా ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఉపాధ్యక్షులు మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, మాజీ జిల్లా కార్యదర్శి ఎస్. జగన్, సీనియర్ నాయకులు గోపాల్ రెడ్డి, రవి, లక్ష్మణ్, మణికంఠ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, నరసింహులు, బూత్ అధ్యక్షులు ఎస్. మాణిక్యం, దుర్గయ్య, నరసింహ చారి, శ్రీకాంత్, ఆంజనేయులు, విజయ్, శివ తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో విశాఖ రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభం: అశ్వినీ వైష్ణవ్



బిఎన్ఎస్:త్వరలో విశాఖ రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. విశాఖ రైల్వే జోన్‌పై ఆయన పార్లమెంట్‌లో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. జనరల్ మేనేజర్, ఇతర ఉన్నతాధికారుల నియామకాలు పూర్తయ్యాయని వెల్లడించారు. జోన్ ప్రధాన కార్యాలయ భవనం పునాది పనులు పూర్తయ్యాయని చెప్పారు. ఎర్రుపాలెం-అమరావతి-నంబూరు లైన్‌కు రూ.2,047 కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఏపీలో రూ.70,232 కోట్లతో రైల్వే ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయని వివరించారు.

# ఫీజు బకాయిలు చెల్లించకుంటే అసెంబ్లీ ముట్టడి: BRSV హెచ్చరిక





బిఎన్ఎస్: పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలని బీఆర్ఎస్వి ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఓయూ ఇంజనీరింగ్ కాలేజీ వద్ద నిరసన తెలియజేసిన బీఆర్ఎస్వి విద్యార్థి నాయకులు. ఈ సందర్భంగా బిఆర్ఎస్వి రాష్ట్ర కార్యదర్శి జంగయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ అసెంబ్లీ సమావేశాల్లో విద్యారంగానికి 20% నిధులు కేటాయించలని డిమాండ్ చేశారూ. ప్రభుత్వం ఏర్పడి సుమారు రెండున్నర సంవత్సరాలు అయినప్పటికి విద్యార్థుల భవిష్యత్తును పట్టించుకోకుండా పెండింగ్ లో ఉన్న 10000 కోట్ల స్కాలర్షిప్ మరియు ఫీజ్ రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయకుండా విద్యార్థులను విద్యకు దూరం చేసే ప్రయత్నం ఈ ప్రభుత్వం చేస్తున్న తీరు వెంటనే మార్చుకోని పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ మరియు ఫీజు నెంబర్స్ మెంట్ బకాయిలను రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు విద్యార్థుల భవిష్యత్తును నిర్లక్ష్యం చేసిన రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వి రాష్ట్ర కార్యదర్శి కె. జంగయ్య, కొంపెల్లి నరేష్, శ్రీకాంత్ ముదిరాజ్, నాగేంద్ర రావు, పవన్ దేవాన్స్, విగ్నేష్ సునీత. భవ్య శ్రీ. మహేశ్వరి తదితర ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకులు పాల్గొన్నారు

# జి.ఓ నెం.4 రద్దుకై హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో నిరసన



బిఎన్ఎస్:హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో జీ.ఓ.నెంబర్ 4 ను రద్దు చెయ్యాలని అక్కడి పీజీ, phd స్కాలర్స్ విద్యార్థులు ప్లకార్డులతో నిరసన తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం జీ. ఓ. నెం. 4 ని ఎవరి కోసం పుట్టించారో తెలియదు కాని ఈ జీ. ఓ ని వెంటనే రద్దు చేయాలని విద్యార్థులు తెలిపారు.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 2011 లో డిగ్రీ లెక్చరర్ నియామకాలు జరిగిన తర్వాత ,16 సంవత్సరాల తర్వాత తెలంగాణ ఏర్పడ్డాక వచ్చే మొదటి నోటిఫికేషన్ . 2022 లో 544 పోస్టుల ఖాళీలతో ఇస్తామన్న నోటిఫికేషన్ నేటికి పెండింగ్ లొనే ఉన్నది.. అది అలా ఉండగానే కొత్తగా ఏ రాష్ట్రంలో లేని విధంగా phd పూర్తి చేసుకున్న వారికి ఏకంగా 25 మార్కుల వెయిటేజ్ ఇవ్వడంతో చాలా మంది నెట్, సెట్ అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.కాబట్టి జీ. ఓ .నెం 4 ను రద్దు చేసి, పాత పద్ధతిలో డిగ్రీ లెక్చరర్ పరీక్షను నిర్వహించాలని లేకపోతే అన్ని యూనివర్సిటీల పర్యటన చేసి విద్యార్థి నిరుద్యోగుల్ని ఏకం చేసి ,అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హైదరాబాద్ సెంటర్ యూనివర్సిటీ విద్యార్థులైన దేవేందర్ రెడ్డి,మహేష్, మహేందర్, ఉపేందర్, అఖిలతో పాటు నిరుద్యోగ జేఏసీ నాయకురాలు అస్మా పాల్గొన్నారు..

# సినిమా న్యూస్



## 'ఉస్తాద్ భగత్ సింగ్' కోసం శ్రీలీలకు రూ.2 కోట్లు?..

ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్న శ్రీలీల పారితోషికం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది.పవన్ కళ్యాణ్ -- హరీష్ శంకర్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమాలో నటించేందుకు శ్రీలీల దాదాపు రూ.2 కోట్ల రెమ్యునరేషన్ తీసుకున్నట్లు తెలుస్తోంది. తన క్రేజ్, డ్యాన్స్ స్కిల్స్, యూత్ ఫాలోయింగ్ దృష్ట్యా మేకర్స్ ఈ మొత్తాన్ని ఇవ్వడానికి ముందుకొచ్చినట్లు సమాచారం. సినిమాలో ఆమె పాత్ర ఎనర్జిటిక్‌గా ఉండబోతుందని, పవన్‌తో కెమిస్ట్రీ హైలైట్ అవుతుందని చిత్ర యూనిట్ భావిస్తోంది. ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్స్‌లో జోరు చూపుతున్న ఈ చిత్రం, ఉగాది కానుకగా థియేటర్లలో సందడి చేయనుంది.



## నోరా ఫతేహి పాటపై వివాదం.. లోక్‌సభలో చర్చ

నోరా ఫతేహి నటించిన 'సర్కే చునార్ తేరీ సర్కే' పాట వివాదం లోక్‌సభలో చర్చకు దారితీసింది. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ఆనంద్ భదౌరియా ఈ అంశాన్ని ప్రస్తావించగా, కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పందించారు.

భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు హద్దులు ఉండాలని, అందుకే ఈ పాటపై నిషేధం విధించినట్లు మంత్రి తెలిపారు.

ధ్రువ్ సర్జా హీరోగా తెరకెక్కుతున్న 'కేడీ: ది డెవిల్' చిత్రంలోని ఈ పాటలో సంజయ్ దత్, నోరా ఫతేహి నటించారు. పాట సాహిత్యం, డ్యాన్స్‌పై విమర్శలు రావడంతో ఆల్ ఇండియా సినీ వర్కర్స్ అసోసియేషన్ ఫిర్యాదు చేసింది.

ఈ నేపథ్యంలో గేయరచయిత రకీబ్ ఆలం స్పందిస్తూ, కొత్త వెర్షన్ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.



## ఈవెంట్‌లో వివాదాస్పద వ్యాఖ్యలు.. క్షమాపణలు చెప్పిన పార్తిబన్

'ఉస్తాద్ భగత్ సింగ్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో చేసిన వ్యాఖ్యలపై నటుడు, దర్శకుడు పార్థిబన్ క్షమాపణలు తెలిపారు. వేదికపై మాట్లాడే సమయంలో అనుకోకుండా కులం ప్రస్తావన రావడంతో విమర్శలు వెల్లువెత్తాయి.

దీనిపై స్పందించిన ఆయన, ఉద్దేశపూర్వకంగా అలా మాట్లాడలేదని, అనుకోకుండా నోరు జారిందని చెప్పారు. తాను ఎప్పుడూ కులవ్యవస్థకు వ్యతిరేకంగా సినిమాలు చేసిన వ్యక్తినని, ఇకపై ఇలాంటి తప్పులు జరగకుండా జాగ్రత్త పడతానని తెలిపారు.పవన్ కళ్యాణ్ హీరోగా, హరీశ్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం మార్చి 19న విడుదల కానుంది.


## బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో రజనీకాంత్ జోరు..



రజనీకాంత్ 75 ఏళ్ల వయసులోనూ వరుస ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా మారారు. రాబోయే రెండేళ్ల పాటు బాక్సాఫీస్ వద్ద 'తలైవర్' జోరు కొనసాగనుంది.

నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'జైలర్ 2' షూటింగ్ చివరి దశకు చేరుకుంది. ఈ చిత్రంలో షారుఖ్ ఖాన్ పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం.తదుపరి 'తలైవర్ 173'ను సిబి చక్రవర్తి తెరకెక్కించగా, కమల్ హాసన్ తన బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు.

ఇక దాదాపు 46 ఏళ్ల తర్వాత రజనీకాంత్-కమల్ హాసన్ కలిసి నటిస్తున్న మల్టీస్టారర్ ప్రాజెక్ట్ కూడా ఈ ఏడాదే సెట్స్‌పైకి వెళ్లనుంది.



## హీరోయిన్లకు ప్రాధాన్యం ఉన్నసినిమాలకు హీరోలు భయపడుతున్నారు

బాలీవుడ్‌లో తనదైన మాటలతో పాటు బలమైన పాత్రలతో గుర్తింపు తెచ్చుకున్న నటి తాప్సీ పన్ను తాజాగా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సినీ పరిశ్రమలో ఉన్న పురుషాధిక్యతపై ఆమె గతంలో చేసిన వ్యాఖ్యలు మళ్లీ చర్చకు దారితీస్తున్నాయి.తాజాగా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన తాప్సీ, కథానాయికలకు ఎక్కువ ప్రాధాన్యం ఉన్న సినిమాల్లో నటించేందుకు చాలా మంది హీరోలు వెనకడుగు వేస్తున్నారని వెల్లడించారు. ముఖ్యంగా తాను ఒక సినిమాలో డబుల్ రోల్ చేస్తున్న సమయంలో జరిగిన ఒక అనుభవాన్ని ఆమె పంచుకున్నారు.

ఆ సినిమా కోసం మేకర్స్ ముందుగా ఒక ప్రముఖ స్టార్ హీరోను సంప్రదించారని తాప్సీ చెప్పారు. అయితే కథలో హీరోయిన్ పాత్రకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందని తెలుసుకున్న ఆ హీరో, అభద్రతా భావంతో ఆ ప్రాజెక్ట్‌ను తిరస్కరించాడని ఆమె తెలిపారు. ఆ హీరోతో తాను గతంలో కలిసి పనిచేసినప్పటికీ, కేవలం పాత్ర నిడివితో పాటు ప్రాధాన్యం కారణంగా ఆయన వెనక్కి తగ్గడం తనకు ఆశ్చర్యం కలిగించిందని తాప్సీ పేర్కొన్నారు. అంతేకాకుండా, ఇండస్ట్రీలోకి కొత్తగా వచ్చిన యువ హీరోలు కూడా హీరోయిన్ ఓరియెంటెడ్ సినిమాల్లో నటించేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రేక్షకుల ప్రశంసలు హీరోయిన్ పాత్రకే ఎక్కువగా దక్కుతాయనే భావన వారిలో ఉండటంతో ఇలాంటి సినిమాలను చాలా మంది హీరోలు దూరంగా ఉంచుతున్నారని ఆమె అన్నారు.

గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, బలమైన కథలతో కూడిన సినిమాల్లో నటిస్తూ ప్రత్యేక గుర్తింపు సంపాదించిన తాప్సీ పన్ను చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చకు దారితీస్తున్నాయి. చిత్ర పరిశ్రమలో సమానత్వం, మహిళా పాత్రలకు ప్రాధాన్యం వంటి అంశాలపై ఆమె మాట్లాడటంపై నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆమె చేసిన కామెంట్స్ మరోసారి నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి.